RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

ప్రభుత్వ ఉద్యోగులకు కొండంత అండ 2



| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 147 | జూన్ 26 శుక్రవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 147 | JUN 26 Fryday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |



# భారీ భూకంపాలతో వణికిన వెనిజువెలా

శతాబ్ద కాలంలోనే అతిపెద్ద విపత్తు



**న్యూఢిల్లీ జన సంఘర్షణ**

వెనిజువెలాలో బుధవారం సాయంత్రం ఊహించని రీతిలో సంభవించిన వరుస భారీ భూకంపాలు తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. కేవలం 39 సెకన్ల వ్యవధిలోనే రెండు శక్తివంతమైన భూప్రకంపనలు చోటుచేసుకోవడంతో ఆ దేశం ఒక్కసారిగా అతలాకుతలమైంది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో వచ్చిన ఈ భూకంపాల తీవ్రత రిక్టర్ స్కేలుపై మొదట 7.2గా, ఆ వెంటనే అంతకంటే ఎక్కువగా 7.5గా నమోదైంది. అమెరికా జియోలాజికల్ సర్వే సమాచారం ప్రకారం, దేశ రాజధాని కారకాస్‌కు పశ్చిమంగా కరీబియన్ తీరంలోని మోరోన్ పట్టణ పరిసర ప్రాంతాల్లో భూమికి దాదాపు 22 కిలోమీటర్ల లోతులో ఈ భూకంప కేంద్రాలు కేంద్రీకృతమై ఉన్నాయి. వందేళ్ల కాలంలో వెనిజువెలా చవిచూసిన అత్యంత ఘోరమైన విపత్తుగా దీనిని పేర్కొంటున్నారు. మొదటి భూకంప ధాటికి భారీ భవనాలు, నివాస సముదాయాలు కుప్పకూలడం ప్రారంభమవగా, ప్రజలు కోలుకుని ప్రాణరక్షణ కోసం పరుగులు తీసే లోపే అంతకంటే బలమైన రెండో భూకంపం విరుచుకుపడింది. ఈ జంట భూకంపాల తీవ్రతకు లా గువైరా (లా గౌరియా) ప్రాంతం తీవ్రంగా దెబ్బతింది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఇప్పటివరకు 32 మంది మరణించినట్లు, 700 మందికి పైగా

➤ మిగతా 2వ పేజిలో..

## భూకంప బాధితులకు అంతర్జాతీయ ఆపన్నహస్తం

### వెనిజువెలాకు అండగా ఉంటామన్న ప్రధాని మోదీ, డొనాల్డ్ ట్రంప్



**న్యూఢిల్లీ జన సంఘర్షణ**

భారీ జంట భూకంపాల ధాటికి అతలాకుతలమైన వెనిజువెలాను ఆదుకునేందుకు అంతర్జాతీయ సమాజం ముందుకు వస్తోంది. ఈ ఘోర విపత్తు వల్ల సంభవించిన భారీ ప్రాణ, ఆస్తి నష్టంపై ప్రపంచ దేశాల అధినేతలు స్పందిస్తూ ఆపన్నహస్తం అందిస్తున్నారు. ఇప్పటివరకు అందుతున్న ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ప్రకృతి వైపరీత్యం వల్ల 32 మంది మరణించగా, మరో 700 మందికి పైగా గాయపడినట్లు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ప్రకటించారు. రాజధాని కారకాస్‌తో పాటు దాని పరిసర నగరాల్లో వందలాది భవనాలు నేలమట్టం కావడంతో, శిథిలాల కింద ఇంకా అనేక మంది చిక్కుకుపోయారని, అందువల్ల మృతుల సంఖ్య రాబోయే రోజుల్లో మరింత పెరిగే ప్రమాదం ఉందని అక్కడి రెస్క్యూ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్లిష్ట సమయంలో వెనిజువెలాలో చోటుచేసుకున్న ప్రకృతి విలయంపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. భూకంప బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఆయన, ఈ కష్టకాలంలో వెనిజువెలా ప్రజలకు భారతదేశం సంపూర్ణంగా అండగా ఉంటుందని సామాజిక

# అంతర్రాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారాలు ముఖ్యం

**సీఎం రేవంత్ రెడ్డి**



**కొప్పల్ జన సంఘర్షణ**

అంతర్రాష్ట్ర నదీ జలాల సమస్యలకు సుదీర్ఘ పంచాయితీలు కాకుండా, త్వరితగతిన శాశ్వత పరిష్కారాలు కనుగొనడమే ముఖ్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కర్ణాటకలోని కొప్పల్ జిల్లా మునీరాబాద్‌లో జరిగిన తుంగభద్ర డ్యాం 33 నూతన స్పిల్‌వే గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. తుంగభద్ర నది ఒడ్డున, బళ్లారి వేదికగా జరిగిన ఈ చారిత్రాత్మక ఘట్టం మూడు తరాల సమస్యలకు ముగింపు పలకడమే కాకుండా, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య నీటి వివాదాల పరిష్కారానికి నాంది పలుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు (మహబూబ్‌నగర్) వంటి కరువు ప్రాంతాల ప్రజల తాగు, సాగునీటి కష్టాలను తీర్చడంలో ఈ

➤ మిగతా 2వ పేజిలో..

# ప్రాజెక్టులే ఆధునిక దేవాలయాల

### నదుల అనుసంధానమే నా కల: ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు



**కొప్పల్ జన సంఘర్షణ**

సాగునీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలని, వాటిని సక్రమంగా పరిరక్షించుకుంటేనే రాబోయే తరాల భవిష్యత్తుకు బలమైన భరోసా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కర్ణాటకలోని మునీరాబాద్‌లో జరిగిన తుంగభద్ర డ్యాం 33 నూతన గేట్ల ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. తుంగభద్ర డ్యాంకు 70 ఏళ్ల ఘనమైన చరిత్ర ఉందని కొనియాడిన ఆయన.. "తుంగభద్ర తల్లికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా" అంటూ కన్నడ భాషలో ప్రసంగాన్ని ప్రారంభించి అక్కడి రైతాంగాన్ని ఆకట్టుకున్నారు. రాయలసీమలోని కడప, కర్నూలు, అనంతపురం వంటి జిల్లాలకు సాగు, తాగునీరు అందిస్తూ లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్న జీవనాడు తుంగభద్ర నది అని ఆయన అభివర్ణించారు. ఎల్ నినో ప్రభావం వల్ల కొన్ని ప్రాంతాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నాయని, నీరు ఉన్న చోటే నాగరికత, చరిత్ర వర్ధిల్లుతాయని గుర్తు చేస్తూ, కేవలం 6 నెలల ఇంజనీర్లు,

➤ మిగతా 2వ పేజిలో..

## ఢిల్లీలో రాజకీయ వేడి: రాష్ట్రపతితో హోంమంత్రి అమిత్ షా భేటీ..

**కేంద్ర కేబినెట్ విస్తరణపై ఊహాగానాలు**



**న్యూఢిల్లీ జన సంఘర్షణ**

దేశ రాజధాని న్యూఢిల్లీలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా తాజాగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. రెండు రోజుల క్రితమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా రాష్ట్రపతిని కలిసి

➤ మిగతా 2వ పేజిలో..

# కోల్‌కతాలో ఘోర ప్రమాదం

**గోడౌన్ కూలిన ఘటనలో ఎనిమిదికి చేరిన మృతుల సంఖ్య**

**కోల్‌కతా జన సంఘర్షణ**

కోల్‌కతా మహానగరంలోని తరతల ప్రాంతంలో బుధవారం సాయంత్రం సంభవించిన ఒక ఘోర ప్రమాదంలో భారీ గోడౌన్ భవనం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ దుర్ఘటనలో మరణించిన వారి సంఖ్య గురువారానికి ఎనిమిదికి చేరుకుంది. ప్రమాద సమయంలో గోడౌన్ లోపల దాదాపు 60 మంది వరకు కార్మికులు విధుల్లో ఉన్నట్లు తెలుస్తోంది. భవన శిథిలాల కింద చిక్కుకున్న పలువురు కార్మికులను రెస్క్యూ బృందాలు తీవ్ర గాయాలతో బయటకు తీసి, చికిత్స నిమిత్తం సమీపంలోని

➤ మిగతా 2వ పేజిలో..

# భారీ భూకంపాలతో వణికిన వెనిజువెలా

**మొదటిపేజీ తరువాయి..** గాయపడినట్లు తెలుస్తున్నప్పటికీ, శిథిలాల కింద వేలాది మంది చిక్కుకుపోవడంతో మృతుల సంఖ్య భారీగా పెరిగే ప్రమాదం ఉందని యూఎస్ జియోలాజికల్ సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విపత్తు వల్ల సంభవించే మరణాల సంఖ్య 10 వేల నుండి లక్ష వరకు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. రాజధాని కారకాస్‌తో పాటు పలు నగరాల్లో వందలాది ఇళ్లు, వాణిజ్య సముదాయాలు నేలమట్టమయ్యాయి. సైమన్ బొలివర్ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ పైకప్పు కూడా ఈ ప్రకంపనలకు కూలిపోవడంతో విమానాశ్రయమంతా దట్టమైన దుమ్ముతో నిండిపోయింది. ప్రయాణికులు ప్రాణభయంతో లగేజీలు వదిలేసి పరుగులు తీశారు. కూలిపోయిన ఇళ్లు, శిథిలాలు, గాల్లో లేచిన దుమ్ము ధూళితో తీరప్రాంత నగరాలు శ్మశానాల్లా మారిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో హృదయవిదారకంగా మారాయి. కట్టుబట్టలతో రోడ్లపైకి వచ్చిన ప్రజలు తమ కుటుంబ సభ్యులను కాపాడుకునేందుకు, శిథిలాలను తొలగించేందుకు ఆరాటపడుతున్నారు.

ఈ ఘోర విపత్తు నేపథ్యంలో వెనిజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. బాధితులను రక్షించేందుకు, శిథిలాల కింద ఉన్నవారిని వెలికితీసేందుకు రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగాయని, సహాయక చర్యలను ముమ్మరం చేశామని ఆమె పేర్కొన్నారు. మరోవైపు ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడో కూడా ఈ దుర్ఘటనపై స్పందిస్తూ బాధితులకు, వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రస్తుతం అక్కడ యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# భూకంప బాధితులకు అంతర్జాతీయ ఆపన్నహస్తం

**మొదటిపేజీ తరువాయి..** మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రకటించారు. బాధితుల కోసం అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు, తక్షణ ఉపశమన సామగ్రిని అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు వెనిజువెలా ప్రజలకు తక్షణ సాయం అందించేందుకు అమెరికా సైతం సంసిద్ధత వ్యక్తం చేసింది. వెనిజువెలా వాసులను తమ దేశానికి అత్యంత గొప్ప స్నేహితులుగా అభివర్ణిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో వెంటనే రెస్క్యూ ఆపరేషన్లు, సహాయక చర్యలు చేపట్టేలా తమ దేశానికి చెందిన అన్ని అత్యవసర సేవా ఏజెన్సీలను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. దీనిపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పందిస్తూ.. బాధితులను ఆదుకునేందుకు, శిథిలాల కింద ఉన్నవారిని వెలికితీసేందుకు అమెరికాకు చెందిన ప్రత్యేక సహాయక బృందాలను ఇప్పటికే రంగంలోకి దించినట్లు వెల్లడించారు. అంతర్జాతీయంగా వస్తున్న ఈ మద్దతు వెనిజువెలాలో పునరావాస చర్యలకు కొండంత అండగా మారుతోంది.

## ప్రభుత్వ ఉద్యోగులకు కొండంత అండ

### చారిత్రాత్మక ప్రమాద బీమా పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

రాష్ట్ర అభివృద్ధిలో ప్రభుత్వ ఉద్యోగులే అత్యంత కీలకమైన భాగస్వాములని, వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా గురువారం సాయంత్రం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఉద్యోగుల పాలిట చారిత్రాత్మకమైన భారీ ప్రమాద బీమా పథకాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ పథకం ద్వారా కేవలం శాశ్వత ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా విధుల్లో ఉన్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో పాటు పెన్షనర్లకు కూడా రూ. ఒక కోటి నుంచి కోటిన్నర వరకు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఒకవేళ విమాన ప్రమాదంలో ఉద్యోగి మరణిస్తే రూ. 3 కోట్ల వరకు బీమా వర్తించేలా బ్యాంకులను ఒప్పించి చారిత్రాత్మక ఒప్పందం (వీశీఖ) కుదుర్చుకున్నామని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని సుమారు 15 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత సిబ్బంది కుటుంబాలకు ఆర్థిక భరోసా చేకూరుతుందని ఆయన వివరించారు.
తొలుత ఈ తరహా ఉచిత బీమా విధానాన్ని సింగరేణి సంస్థలో ప్రయోగాత్మకంగా అమలు చేశామని, ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన 45 మంది సింగరేణి కార్మికుల కుటుంబాలకు ఇప్పటికే కోటిన్నర చొప్పున బీమా సొమ్మును అందించి ఆదుకున్నామని సీఎం గుర్తుచేశారు. ఈ ప్రతిష్టాత్మక పథకం విజయవంతం కావడం వెనుక డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అపారమైన కృషి ఉందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తాను ఏనాడూ దొరలా భావించుకోలేదని, సామాన్య మధ్యతరగతి కుటుంబం నుంచి ప్రజల మధ్య పెరిగి వచ్చిన వాడిని కాబట్టే ఉద్యోగుల కష్టాలు, అవసరాలు తనకు బాగా తెలుసని భావోద్వేగంగా పేర్కొన్నారు. పదవులు మారినా ప్రజలతో తనకున్న అనుబంధం ఎప్పటికీ మారదని, అందరూ తనను 'రేవంతన్న' అని పిలుచుకోవడమే తనకు ఇష్టమని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నెలలో 10వ తేదీ వచ్చినా జీతాలు దొరకని దారుణ పరిస్థితులు ఉండేవని, కానీ తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరి 1వ తేదీ నుంచి

# అంతర్రాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారాలు ముఖ్యం

**మొదటిపేజీ తరువాయి..** ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు సువర్ణాక్షరాలతో నిలిచిపోతాయని సీఎం అభివర్ణించారు. ఈ సందర్భంగా కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ పనితీరును ముఖ్యమంత్రి కొనియాడారు. తక్కువ మాట్లాడి, అత్యంత వేగంగా పనులు పూర్తి చేసే ప్రత్యేకత కలిగిన సీఆర్ పాటిల్ కేంద్ర మంత్రిగా ఉండటం మూడు రాష్ట్రాల రైతాంగానికి కలిసివచ్చే అంశమని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఆయన ఇక్కడి జల సమస్యలకు ముగింపు పలకాలని కోరారు. ఉమ్మడి జలాల సమస్యలను సకాలంలో పరిష్కరించుకోకపోవడం వల్లే విలువైన నీరంతా వృథాగా సముద్రం పాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (=ఱూ) ద్వారా పాలమూరు ప్రాంతానికి కేటాయించిన 15 టీఎంసీల నీటిలో ప్రస్తుతం కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నామని, మిగిలిన 10 టీఎంసీల నీరు తమకు అందడం లేదని సీఎం గుర్తుచేశారు. నీటి కొరత కారణంగానే పాలమూరు ప్రజలు ఉపాధి కోసం వలసలు వెళ్లాల్సి వస్తోందని, ఈ ఇబ్బందులను ఇప్పటికే కేంద్రమంత్రి పాటిల్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు ఆయన స్పష్టం చేశారు.

రాయలసీమ, తెలంగాణ పరిధిలోని లక్షలాది మంది రైతుల కష్టాలను, అవసరాలను గుర్తించిన నాయకుడిగా చంద్రబాబును రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రశంసించారు. తుంగభద్ర డ్యామ్‌లో పూడికతీత వ్యవహారంతో పాటు తెలంగాణకు దక్కాల్సిన చట్టబద్ధమైన నీటి వాటాపై కేంద్రమంత్రితో ఫలప్రదమైన చర్చలు జరిగాయని, మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఒక కొలిక్కి రావడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ సభలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ కూడా పాల్గొన్నారు. రాష్ట్రాల మధ్య సత్సంబంధాలతో, కేంద్ర సహకారంతో తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోని కరువు జిల్లాల రైతులకు త్వరలోనే పూర్తి న్యాయం జరుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# ప్రాజెక్టులే ఆధునిక దేవాలయాల

**మొదటిపేజీ తరువాయి..** స్వల్ప వ్యవధిలోనే రికార్డు స్థాయిలో 33 గేట్ల పునరుద్ధరణ పనులను పూర్తి చేసిన కార్మిక బృందాలను ఆయన అభినందించారు. దేశంలో నదుల అనుసంధానం అనేది తన జీవితకాల కలల ప్రాజెక్టు అని చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. గంగ, గోదావరి, కావేరి నదులను అనుసంధానం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా గోదావరి-కావేరి అనుసంధానాన్ని కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలని ఆయన కోరారు. ఉత్తరాదిన ఉన్న గంగను, దక్షిణాదిన ఉన్న కావేరి నదితో అనుసంధానించగలిగితే భారతదేశం ఆర్థికంగా, వ్యవసాయపరంగా తిరుగులేని శక్తిగా (అన్‌స్టాపబుల్‌గా) దూసుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు గతంలో గుజరాత్‌లో నదుల అనుసంధానం చేసిన అపారమైన అనుభవం ఉందని ప్రశంసించారు. గతంలో 1983లోనే తమిళనాడుకు నీళ్లు ఇవ్వాలని తాము చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. జలవనరుల సంరక్షణ, సమర్థవంతమైన నీటి నిర్వహణే ధ్యేయంగా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు.

కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ఆధ్వర్యంలో ముగ్గురు ముఖ్యమంత్రులు ఒకే వేదికపైకి రావడం ఒక చారిత్రాత్మక ఘట్టమని చంద్రబాబు పేర్కొన్నారు. కాగా, కేంద్రమంత్రి సమక్షంలో తామంతా కలిసి ఒక చారిత్రాత్మక తీర్మానం చేశామని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల రైతుల సంక్షేమం కోసం తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, తాను కలిసి జల వివాదాల పరిష్కారంలో సరికొత్త చరిత్ర సృష్టిస్తామని, ముగ్గురం పూర్తి సమన్వయంతో పనిచేస్తూ మూడు రాష్ట్రాల సర్వతోముఖాభివృద్ధికి, రైతాంగ శ్రేయస్సుకు కట్టుబడి ఉంటామని డి.కె. శివకుమార్ స్పష్టం చేశారు.

## సికింద్రాబాద్‌లో అగ్నిప్రమాదం

**హైదరాబాద్, జూన్25** సికింద్రాబాద్‌లో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. స్వప్నలోక్ కాంప్లెక్స్ పక్కన ఉన్న సూర్య కిరణ్ బిల్డింగ్ మొదటి అంతస్తులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. భవనం నుంచి పొగ, మంటలు ఎగసిపడటంతో పరిసర ప్రాంతాల్లో కలకలం రేగింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదం కారణంగా భవనంలోని పలు అంతస్తులు పొగతో నిండిపోయాయి. భవనంలో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తరలించే చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో భారీ
అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో భవనంలో భద్రతా ప్రమాణాలపై

# ఢిల్లీలో రాజకీయ వేడి: రాష్ట్రపతితో హోంమంత్రి అమిత్ షా భేటీ..

**మొదటిపేజీ తరువాయి..** చర్చలు జరిపిన నేపథ్యంలో, ఇప్పుడు హోంమంత్రి అమిత్ షా సైతం ఆమెతో సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో త్వరలోనే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ (కేబినెట్ విస్తరణ) ఖాయమనే ప్రచారం ఢిల్లీ వర్గాల్లో జోరందుకుంది. జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టుల రాజ్యసభ పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం కేంద్ర కేబినెట్‌లో కొన్ని ఖాళీలు ఏర్పడ్డాయి. దీనికి తోడు కేంద్ర మంత్రులుగా కొనసాగుతున్న కొందరు సీనియర్ నాయకులకు వివిధ రాష్ట్రాల బీజేపీ పార్టీ అధ్యక్ష బాధ్యతలను అధిష్ఠానం అప్పగించింది. 'ఒకరికి ఒకే పదవి' అనే నిబంధన ప్రకారం వారు త్వరలోనే తమ మంత్రి పదవులకు రాజీనామా చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

మరోవైపు రాబోయే పంజాబ్, ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, సామాజిక సమీకరణల ఆధారంగా ఆయా రాష్ట్రాలకు చెందిన కొత్త ముఖాలకు కేంద్ర కేబినెట్‌లో చోటు కల్పించాలని బీజేపీ భావిస్తోంది. అలాగే ఎన్డీయే కూటమిలోని కీలక భాగస్వామ్య పక్షాలైన శివసేన (షిండే వర్గం), జనతాదళ్ యునైటెడ్ (జేడీయూ) వంటి పార్టీల నుంచి అదనపు మంత్రి పదవుల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతున్నట్లు సమాచారం. ఈ డిమాండ్లను పరిశీలిస్తూనే, రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల లోపే మంత్రివర్గ విస్తరణ ప్రక్రియను పూర్తిగా కొలిక్కి తీసుకురావాలని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా ద్వయం కసరత్తు చేస్తోంది. సాధారణంగా జులై 20వ తేదీ తర్వాత పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున, అంతకంటే ముందే కొత్త మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఢిల్లీ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.

# కోల్‌కతాలో ఘోర ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి..** ఆసుపత్రికి తరలించారు. కాగా, శిథిలాల కింద ఇంకా మరో 18 మంది వరకు చిక్కుకుని ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. బుధవారం ప్రమాదం జరిగిన వెంటనే ఐదుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరికొందరు మరణించడంతో మృతుల సంఖ్య పెరిగింది. ఈ ఘోర ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి తన మంత్రివర్గ సహచరులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆయన స్వయంగా అక్కడే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించడంతో పాటు, బాధితులకు వేగంగా వైద్య సహాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ప్రమాద స్థలంలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (చీణ=ఖీ), స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ూణ=ఖీ), భారత సైన్యం, నగర పోలీసు విభాగాలు స్థానికుల సహాయంతో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలను కొనసాగిస్తున్నాయి. భారీ యంత్రాల సాయంతో శిథిలాలను తొలగిస్తూ లోపల ఉన్నవారిని రక్షించేందుకు శ్రమిస్తున్నారు.

మరోవైపు, ఈ ప్రమాదంలో చిక్కుకున్న బాధితుల సమాచారం కోసం, వారి కుటుంబ సభ్యులకు ఆసరాగా నిలిచేందుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. బాధితుల వివరాల కోసం 8697981070, 033-22143526, 033-22535185 నెంబర్లను సంప్రదించవచ్చని అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

## ల్యాండ్ పూలింగ్ ప్లాట్లలో అభివృద్ధి పనులు

### రూ.426.46 కోట్ల వ్యయంతోమౌలిక సదుపాయాలు

**అమరావతి, :**
ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. ఉండవల్లి జోన్-11 పరిధిలో ట్రంక్ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మొత్తం రూ. 426.46 కోట్ల వ్యయంతో భారీ మౌలిక సదుపాయాల పనులను చేపట్టనుంది. అమరావతి ల్యాండ్ పూలింగ్ లేఅవుట్ల అభివృద్ధికి అవసరమైన ఈ పనులను ప్యాకేజీ-38 కింద చేపట్టనున్నారు.ఈ ప్రాజెక్టు కింద రోడ్లు, డ్రైన్లు, సరఫరా, సెవరేజ్ పనులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యుత్ సరఫరా, ఐసీటీ యుటిలిటీ డక్ట్లు, రీయూజ్ వాటర్ లైన్ నిర్మాణానికి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎస్‌టీపీ ఏర్పాటు, అవెన్యూ ఎ÷-లాంటేషన్ పనులను ఈ ప్యాకేజీలో భాగంగా అమలు చేయనున్నారు ఎల్-1 బిడ్డర్‌గా ఎంపికైన ఎన్‌సీసీ లిమిటెడ్‌కు పనులను కేటాయించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అంచనా వ్యయం రూ. 409.78 కోట్లు ఉండగా, 4.07 శాతం అధిక బిడ్‌కు అనుమతి ఇచ్చింది. ఈ కాంట్రాక్ట్‌కు రెండేళ్ల డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌ను నిర్దేశిరచింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి జూన్ 19న జరిగిన ఏపీసీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో తీర్మానం నెం. 669/2026 ఆమోదం పొందింది. అనంతరం ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం. 777ను జారీ చేస్తూ అధికారిక ఉత్తర్వులు విడుదల చేసింది. పనుల అవార్డు జారీ చేసేందుకు ఏడీసీఎల్ సీఎండీకి అధికారాలను అప్పగించింది. ఉండవల్లి ప్రాంతంలో సమగ్ర మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా రాజధాని నిర్మాణానికి మరింత వేగం చేకూరనుంది. ఈ ప్రాజెక్టు అమలుకు అవసరమైన నిధులను ఏపీసీఆర్‌డీఏ సమకూర్చనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజధాని అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

# సబ్ జైలులో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

- మాదకద్రవ్యాల మహమ్మారిపై జైలు పర్యవేక్షణాధికారి ఏ. సుభాష్ పిలుపు
- జైలు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం: కరపత్రాల విడుదల

**ఇల్లందు జూన్ 25 (జన సంఘర్షణ)**

అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం (జూన్ 26) సందర్భంగా పట్టణంలోని సబ్ జైలు నందు శనివారం ఖైదీలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజానికి పట్టిన మాదకద్రవ్యాల మహమ్మారి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జైలు అధికారి ఏ. సుభాష్ ఆధ్వర్యంలో.. ఈ కార్యక్రమం జైలు పర్యవేక్షణ అధికారి (సూపరింటెండెంట్) ఏ. సుభాష్ నేతృత్వంలో అత్యంత క్రమశిక్షణతో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన ముద్దాయిలను (ఖైదీలను) ఉద్దేశించి ప్రసంగిస్తూ, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

**వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపు**

మత్తు పదార్థాల వినియోగం వల్ల జీవితాలు ఎలా చిన్నాభిన్నమవుతాయో సుభాష్ ఖైదీలకు క్షుణ్ణంగా వివరించారు. జైలు నుంచి విడుదలైన తర్వాత ప్రతి ఒక్కరూ వ్యసనాలకు దూరంగా ఉంటూ, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా జీవించాలని ఆయన ఈ సందర్భంగా హితవు పలికారు.

**జైళ్ళ శాఖ కరపత్రాల విడుదల**

అవగాహన కల్పించడంలో భాగంగా జైళ్ళ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను (పాంప్లెట్స్) ఈ కార్యక్రమంలో విడుదల చేశారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, చట్టపరమైన శిక్షల వివరాలతో కూడిన ఈ కరపత్రాలను ఖైదీలకు పంపిణీ చేశారు.



**సబ్ జైలు సిబ్బంది భాగస్వామ్యం**

ఈ కార్యక్రమంలో సబ్ జైలు సిబ్బంది అందరూ చురుగ్గా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో జైలు అధికారులు, వార్డన్లు కీలక పాత్ర పోషించారు. ఖైదీలు సైతం క్రమశిక్షణతో ఉంటూ అధికారి చెప్పిన విషయాలను శ్రద్ధగా విన్నారు.

# అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం

- ఎస్ఐ కేశవ
- గురుదేవ్ విద్యాలయం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జూన్ 25(జనసంఘర్షణ):**

చర్ల మండలంలోని గురుదేవ్ విద్యాలయంలో అవగాహనా సదస్సు జరిగినది. ఇందులో భాగంగా ఎస్. ఐ. కేశవ విద్యార్థులను ఉద్దేశించి ఎన్నో విషయాలను తెలియజేసారు.

హెల్మెట్: ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ఎన్నో ప్రమాదాల నుండి రక్షించగలదని కాబట్టి ఈ విషయాన్ని విద్యార్థులు వారి తల్లిదండ్రులకు చుట్టు ప్రక్కల వారికీ తెలియజేయాలనీ సూచించారు. మైనర్ విద్యార్థులు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, ప్రమాదాలకు కారణమవుతుందని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సీట్ బెల్ట్ : కారు ప్రయాణం లో సీటు బెల్ట్






తప్పనిసరి అని తెలిపారు.


మాదక ద్రవ్యాలు: మనిషి జీవితాన్ని నాశనం చేసే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అత్యుత్సాహంతో ప్రలోభాలకు లొంగి మత్తు పదార్థాలకు బానిసలు కారాదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే హెల్ప్‌లైన్ నంబర్ల ప్రాముఖ్యతను వివరిస్తూ, పోలీసు సహాయం కోసం 100, సమగ్ర అత్యవసర సేవల కోసం 112, పిల్లల రక్షణ సంక్షేమం కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హెచ్. జి. వి.ప్రసాద్, అకడమిక్ కోఆర్డినేటర్స్ ఎం.వి సుబ్రహ్మణ్యం, జి.శ్రీనివాస్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు హెచ్. జి. వి. ప్రసాద్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల పట్ల, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల, తమ విలువైన సందేశాన్ని అందించిన ఎస్సై కేశవకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఆదిలాబాద్ జిల్లా జైలులో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ

- మాదకద్రవ్యాల మహమ్మారిపై సమరానికి పిలుపునిచ్చిన జిల్లా జైలర్ చంద్రశేఖర్

**ఆదిలాబాద్ జూన్ 25 (జన సంఘర్షణ)**

మాదకద్రవ్యాల మహమ్మారి లేని డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఆదిలాబాద్ జిల్లా జైలర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా జైలు ప్రాంగణంలో డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక అవగాహన, ప్రతిజ్ఞా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఈ వ్యసనంపై అందరూ కలిసికట్టుగా పోరాడాలన్నారు. డ్రగ్స్‌పై పోరాటం కేవలం జైళ్ల శాఖ లేదా పోలీసుల బాధ్యత మాత్రమే కాదని జిల్లా జైలర్ చంద్రశేఖర్ స్పష్టం చేశారు. సమాజంలో మార్పు రావాలంటే ప్రతి ఇల్లు, ప్రతి బడి, ప్రతి వీధి ఈ పోరాటంలో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు ఈ వ్యసనాలకు దూరంగా ఉండేలా చైతన్యం తీసుకురావాల్సిన






బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జైలు సిబ్బంది, ఖైదీలతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాదక ద్రవ్యాలను తాము సేవించబోమని, ఇతరులను ప్రోత్సహించబోమని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్స్ వల్ల జీవితాలు ఏ విధంగా నాశనమవుతాయో వివరించారు. సమాజ భవిష్యత్తును కాపాడుకునేందుకు యువతను సరైన మార్గంలో నడిపించాలని జిల్లా జైలర్ చంద్రశేఖర్ కోరారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా, లేదా ఎక్కడైనా అనుమానాస్పద కదలికలు గుర్తిస్తే వెంటనే పోలీస్ శాఖకు సమాచారం అందించి బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని జిల్లా జైలర్ చంద్రశేఖర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అక్రమార్కుల సమాచారాన్ని గోప్యంగా ఉంచి కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. మత్తు రహిత సమాజ మార్పు కోసం మనం వేసే ప్రతి చిన్న అడుగు భవిష్యత్తు సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని జిల్లా జైలర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. నేర రహిత, డ్రగ్స్ రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను మార్చేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరడంతో ఈ కార్యక్రమం ముగిసింది.

# మెదక్ జిల్లాలో పార్ట్ టైం ఉపాధ్యాయుల నియామకం

- ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం.
- మెదక్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్.
- ఈ నెల 26 నుండి జూలై 4 వరకు దరఖాస్తుల స్వీకరణ.
- జూలై 6న డెమో, ఇంటర్వ్యూల నిర్వహణ.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 25 (జన సంఘర్షణ)**

మెదక్ జిల్లాలో పార్ట్ టైం ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాల నోటిఫికేషన్కు సంబంధించి కలెక్టర్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల పరిధిలో ఉన్న మెదక్, తూప్రాన్, రామాయంపేట, కుల్చారం పాఠశాలలు, జూనియర్ కళాశాలలో, టీజీఎస్ డబ్ల్యూ ఆర్ డబ్ల్యు ఆర్ డి సి (జె) మెదక్ డిగ్రీ కళాశాలలో మొత్తం 23 ఖాళీ పోస్టు ఉన్నట్లు పేర్కొన్నారు వీటిలో జూనియర్ లెక్చరర్లు(తెలుగు,ఇంగ్లిష్ బోటనీ), పీజీటీలు తెలుగు కాకుండ మిగత అన్ని సబ్జెక్టులు) టీజీటీలు(తెలుగు, హిందీ, ఫిజికల్ సైన్స్, బయోసైన్స్) పిజికల్ డైరెక్టర్, పిఈటి, లైబ్రేరియన్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులు నిర్దేశించిన విద్యార్హతలు కలిగి ఉండాలనీ,గురుకుల విద్యాసంస్థల నిబంధనల మేరకు మహిళా విద్యాసంస్థలలో మహిళలకే ప్రాధాన్యత ఇవ్వబడుతుందని వివరించారు. ఖాళీగా ఉన్న వివిధ బోధనా పోస్టులను 2026-27 సంవత్సరానికి పార్ట్ టైం ప్రతిపాదికన భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 26-06-2026 నుండి 04-07-2026 వరకు తమ ఒరిజినల్ , జిరాక్స్ పత్రాలతో దరఖాస్తులు సమర్పించవచ్చు. దరఖాస్తుల పరిశీలనానంతరం 06-07-2026 ఉదయం 10:00 గంటలకు TGSWRS/JC(G) మెదక్‌లో సబ్జెక్టు నిపుణుల కమిటీ ద్వారా డెమో , ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయి ఇతర వివరాల కోసం మెదక్ జిల్లా సమన్వయకర్త అయిన అనురాధని సంప్రదించగలరు. 9059526124 వివరాలకు సంప్రదించాలి.

# విత్తనాల పండుగ మన సంస్కృతికి, కృషికి ప్రతీక!




గగన సీమలో నల్ల మబ్బుల ఘనత
దివి నుండి భువికి జారిన అమృతపు చినుకుల వాన
వేసవి తాపాన్ని హరించి,పుడమి తల్లిని పులకింపజేస్తూ.
తొలకరి ఆగమనాన్ని చాటిందిలే ఆరుద్ర కార్తె!
ఎండలకు అలసి, నెర్రెలు బారిన నేల తల్లి చలువచేసి, పచ్చని పైరుకు స్వాగతం పలికింది!
రైతన్న గుండెల్లో ఆశల పంటలు పండిస్తూ
ఏరువాక పున్నమి పండుగ ఆహ్వానం పలికింది!
అలసట ఎరుగని ఎడ్ల మెడపై కాడిమోపి
పచ్చని చేలల్లో నాగలి సాలు సాగిస్తుంటే
భూదేవికి నమస్కరించి, ఆశయాల విత్తనాలు చల్లుతుంటే ఆ దృశ్యం కనువిందు చేసే ప్రకృతి ఒడి!
మృగశిర దాటి ఆరుద్ర అడుగుపెట్టగానే
పంట పొలాలు పచ్చని తివాచీ పరిచినట్లు ఉన్నాయి
ఖరీఫ్ సీజన్ మొదలై రైతన్నల మోముల్లో కోటి ఆశల నవ్వులు విరిసాయి!
ఏరువాక సాగే వేళ.. హోయలు పోయే పల్లె గాలిలో
చేపల వలల చప్పుళ్ళు, జానపదుల పాటల మురిపాలు
నాట్లు వేసే ఆడపడుచుల ఆటపాటలు
పల్లె సీమలకు కొత్త అందాన్ని తెచ్చాయి!
పంటలు బాగా పండి దేశం సుభిక్షంగా ఉండాలని
రైతు చెమట చిందించి నేలను నమ్ముకుని చేసే
ఈ పవిత్రమైన విత్తనాల పండుగ
మన సంస్కృతికి, కృషికి ప్రతీక!

**రచన :బత్తుల వెంకటేశ్వర్లు, చర్ల. 9346505167.**

# ఏకపాత్రాభినయ నటుడికి జన్మదిన శుభాకాంక్షలు

- కళారవళి చర్ల



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జూన్ 25(జనసంఘర్షణ):**

చర్ల మండలం, నీలి నందు బాబుకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు, కళాపోషకుడు, ప్రతిభావంతమైన కళాకారుడు, కళలను ఆరాధ్య దైవంగా భావించి సేవ చేస్తున్న కళాసేవకుడు నీలి నందు బాబు, తన ఏకపాత్రాభినయంతో ఎందరో అభిమానులను సంపాదించుకుని ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇలాంటి మహోన్నత వ్యక్తిత్వం కలిగిన నందు బాబుకి జన్మదిన సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, మరెన్నో విజయాలు చేకూరాలని మనస్ఫూర్తిగా, కళాభి మానులు కోరుకుంటున్నారు.

# ఓటర్ల జాబితా సవరణ సర్వే షురూ

- అప్రమత్తంగా లేకుంటే ఓటు గల్లంతే
- ఇంటింటికీ బీఎల్ఓలు.. వివరాల నమోదులో నిర్లక్ష్యం వద్దు: కొర్లపాటి శివ కిరణ్

**ఇల్లందు జూన్ 25 (జన సంఘర్షణ)**



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటి సర్వే ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా 22వ వార్డులో నిర్వహించిన ఓటర్ల జాబితా కార్యక్రమంలో 22వ వార్డ్ కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 2002 ఓటర్ల జాబితాను ఆధారంగా చేసుకుని, ప్రస్తుత ఓటర్లతో మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఓటర్లు అందరూ అప్రమత్తంగా ఉండి ఈ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) నేటి నుండి నెల రోజులపాటు ప్రతి ఇంటికి వెళ్లి సమగ్ర ఓటర్ల వివరాలను సేకరిస్తారని 22వ వార్డ్ కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ తెలిపారు. సర్వేకు వచ్చే అధికారులు ప్రతి ఓటరుకు రెండు ఇన్యూమరేషన్ ఫారాలను అందిస్తారని, వాటిలో సరైన వివరాలను నింపి ఒక ఫారాన్ని అధికారులకు ఇచ్చి, మరొకటి ఓటర్లు తమ వద్ద భద్రపరచుకోవాలని సూచించారు. ఈ సర్వేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సర్వేను నిర్లక్ష్యం చేస్తే ఓటు తొలగిపోయే ప్రమాదం ఉందని, దానివల్ల భవిష్యత్తులో రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని 22వ వార్డ్ కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ బాలరాజు, వార్డ్ ఆఫీసర్ రజిని, అంగన్వాడి టీచర్ అజ్మీర సక్కుబాయి, బీఎల్ఏలు కోలపురి ఝాన్సీ, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

# అప్పాయిగూడెం ఓటర్లకు ఈఎఫ్ఎస్ ఫారాల పంపిణీ




ఈ రోజు అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో సర్-2026 కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు ఈఎఫ్ఎస్ ఫారాలను పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొని ఫారాలను స్వీకరించారు. ప్రజలు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసి నిర్ణీత గడువులోపు సమర్పించాలని సూచించబడింది. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్ దండు ప్రవీణ్, ఉప సర్పంచ్ ఎట్టి సంధ్య రాణి, కార్యదర్శి కృష్ణవేణి, సర్ అప్పాయిగూడెం ఇంచార్జ్, బీఎల్ఓ తదితరులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
శుక్రవారం 26 జూన్ 2026

# స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చెయ్యాలి

- స్వర్ణకారుల మెదక్ జిల్లా అధ్యక్షుడు పున రవీందర్ చారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
- జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు.
- తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.





**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 25: (జన సంఘర్షణ)**

స్వర్ణ కారులకోసం వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలని మెదక్ జిల్లా విశ్వ బ్రాహ్మణ స్వర్ణ కారుల సంఘం జిల్లా అధ్యక్షులు పున రవీందర్ చారి డిమాండ్ చేశారు. గురువారం మెదక్ జిల్లా సమీకృత కలెక్టరేట్ ముందు విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఓకు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షులు పూనా రవిందర్ చారి, ప్రధాన కార్యదర్శి సుంకోజు దామోదర్ చారి మాట్లాడుతూ జి.ఓ.272కు సవరణ చేయాలని డిమాండ్ చేశారు. దీనివల్ల దొంగిలించబడిన బంగారానికి సంబంధించి నిరాధారమైన రికవరీ చర్యల నుండి స్వర్ణకారులకు రక్షణ లభిస్తుందన్నారు. చేనేత, గీత కార్మికుల మాదిరిగానే, 50 ఏళ్లు పైబడిన స్వర్ణకారులకు కూడా రూ. 5 వేల పెన్షన్ అందించాలని, వృత్తిని కోల్పోయి ఆత్మహత్యలు చేసుకున్న స్వర్ణకారులకు ఆర్థిక సహాయం చేసి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. స్వర్ణకారుల వృత్తిని రాష్ట్ర ప్రభుత్వం కాపాడాలని, కీ.శే. డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్రెడ్డి ఆమోదించిన 5 మెన్ కమిటి నివేదిక తమిళనాడు తరహా తెలంగాణలో అమలు చేయాలన్నారు. తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ తరహా స్వర్ణకారుల కార్పోరేషన్ వెల్ఫేర్ బోర్డ్ తెలంగాణలో ఏర్పాటు చేయాలి. స్వర్ణకారుల పోలీస్ వేధింపులను ప్రభుత్వం అరికట్టాలి. విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం జిల్లా రాష్ట్ర కార్యదర్శి నెమలి శ్రీనివాస్, జిల్లా కోశాధికారి వెంకటేశం, పట్టణ అధ్యక్షులు బ్రహ్మచారి, కార్యదర్శి వేణు, కోశాధికారి కాశీనాథ్, శంకర్ దయాళ్ చారి, బ్రహ్మచారి, రవి, శ్రీనివాస్ చారి, జెఎల్ శ్రీనివాస్ చారి, నవీన్ రవీందర్ చారి, రమేష్ చారి, నరేష్ చారి, సిద్ధిరాములు, కిశోర్, నాగేందర్, స్వర్ణకారులు పాల్గొన్నారు.

# నేడు అంతర్జాతీయ అవయదాన మార్పిడి దినోత్సవం

- లయన్ డాక్టర్"ఏలేటి రాజశేఖర్ రెడ్డి ఎంజెఎఫ్ జిల్లా కార్యదర్శి, రక్త, అవయవ దానాల అవగాహన జిల్లా 320 ప్రతినిధి.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 25 (జన సంఘర్షణ)**

నేడు సమాజంలో రోజురోజుకి అవయవాలు దానం చేసే వారి గురించి ఎంతోమంది ఆతృతగా ఎదురు చూస్తున్నది మనందరికీ తెలిసిన విషయమే అవయవాలు సరియైన సమయంలో దానం చేసేవారు లేక ఎందరో మృత్యువాత పడుతున్నారు. అవయవ దానము యొక్క అవగాహన కొరవడి చనిపోయిన తర్వాత శరీరాన్ని కాల్చడం లేదా పూడ్చడం చేస్తున్నారు. అందుకే అవయవ దానము అలాగే మార్పిడిని వాటి ప్రాముఖ్యతను,అవశ్యకతను తెలపడానికి నేడు ప్రపంచ అవయవ దాన మార్పిడి దినోత్సవం గా గుర్తించడం జరిగింది. ఆ సృష్టికర్త మనిషిని సృష్టిస్తే. మనిషిగా మనం చేయగలిగిన మహత్తర దానములు.రక్త,అవయవ దానములు"అత్యంత మహోన్నతమైనవి, పునర్జన్మను ప్రసాదించేవి , జన్మకు విలువనిచ్చేవి. సమాజంలో ఇతరులకు ఉపయోగపడే అన్ని దానములు గొప్పవే వాటిలో మహోన్నతమైనవి మరియు ప్రమాద సమయంలో ప్రాణాలు కాపాడేవి. 1).రక్తదానం 2). అవయవ దానములు. స్వచ్ఛందంగా




సేవలందించే వారిని, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలను, యువతి యువకులు సహృదయతతో మానవత్వంతో ఆలోచించి, రక్తదాన, అవయవ దానాలకు వాటి మార్పిడికి కృషి చేయవలసిందిగా అభ్యర్థిస్తున్నాను. ఈ లయన్స్ సేవా (2025-2026)సంవత్సరంలో అవయవదానము, మార్పిడిపై అవగాహన కల్పించడానికి కృషి చేయడం జరిగింది. దాంట్లో భాగంగానే ఈ ప్రత్యేకమైన 26వ గోడ పత్రికను మీ ముందర ఉంచుతున్నాను.

## మక్త భూపతిపూర్ గ్రామానికి చెందిన కవిత లక్ష్మీనారాయణల కుమార్తె వివాహానికి పుస్తె మట్టెలు అందజేత

- కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 25 (జన సంఘర్షణ)**



మెదక్ మండలం మక్త భూపతిపూర్ గ్రామానికి చెందిన కవిత-లక్ష్మీనారాయణ చారి కూతురు మహేశ్వరి వివాహం తెలంగాణ భవన్ మెదక్‌లో ఏర్పాటు చేయగా ఇట్టి వివాహానికి కాంగ్రెస్ పార్టీ నాయకుడు,లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్‌నీ ఆహ్వానించగా వారు వివాహానికి హాజరై పూస్తే మట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పవన్, జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు సాపరవి, రమేష్, కృష్ణ, లక్ష్మయ్య, శ్రీను, మురళి, మధు, రవి, సురేష్, బాలకృష్ణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- సరైన పత్రాలు సమర్పించి ఓటు హక్కును పరిరక్షించుకోవాలి

**కారేపల్లి ప్రతినిధి: (జన సంఘర్షణ)**



సింగరేణి మండలంలోని గాదెపాడు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేక ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటరుకు అవసరమైన ఎన్యుమరేషన్ ఫారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ యాదవ్, వీఆర్వో శ్రీనివాసరావు, గాదెపాడు గ్రామ సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ పాల్గొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ప్రతి ఓటరు తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు అవసరమైన ధ్రువపత్రాలను సంబంధిత బీఎల్ఓలకు సమర్పించాలని అధికారులు సూచించారు.ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలు ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సరిచేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో తమ పేర్లు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

# సర్ లో పూర్తి వివరాలు నమోదు చేయాలి

- ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాల సవరణ కార్యక్రమం లో (ఎస్ఐఆర్-2026) పూర్తి వివరాలు సేకరించాలి.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 25 (జన సంఘర్షణ)**





మెదక్ జిల్లా నర్సాపూర్ మున్సిపాలిటీ నర్సాపూర్ మండలంలోని అచ్చంపేట గ్రామంలో సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో ఆర్డీవో తాహాసిల్దార్ తో కలిసి జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. బూత్ స్థాయి అధికారులకు కార్యక్రమం నిర్వహణపై పలు సూచనలు చేయడం జరిగిందన్నారు. ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయడం, తిరిగి సేకరించడం, వివరాల నమోదు అంశాలలో జాగ్రత్త వహించాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్య బాధ్యత అని పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ద్వారా ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందిస్తున్నామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి ఓటరుగా నమోదు కావాలని, చిరునామా మార్పులు,పేరు సవరణలు, ఇతర వివరాల నవీకరణ కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటరు జాబితా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. నేటి నుంచి బూత్ లెవల్ అధికారులు బి ఎల్ వో లు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని,ప్రజలుసరైన వివరాలను అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ తాసిల్దార్ శ్రీనివాస్, బిఎల్వోలు, సర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ ప్రక్రియ ప్రారంభం

- కాంగ్రెస్ పార్టీ చర్ల మండల అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జూన్ 25(జనసంఘర్షణ):**




భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, ఎస్ ఐ ఆర్ ప్రక్రియ జూన్ 25 నుండి ప్రారంభమైంది. నకిలీ ఓటర్లను తొలగించి, అర్హులైన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. ప్రజలందరూ తప్పనిసరిగా సహకరించవలసిన అంశాలు.. బూత్ లెవల్ అధికారులు, బి ఎల్ ఓ ఇంటింటికీ వచ్చి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తారు. ఇంట్లో ఎంతమంది ఓటర్లు ఉంటే అంతమందికి ప్రత్యేక ఫారాలు ఇస్తారు.మీ వివరాలు సరిచూసుకుని అవసరమైన సవరణలు చేసి, పూర్తిగా నింపిన ఫారాలను జూలై 24 లోపు బి ఎల్ ఓ లకు తిరిగి అందజేయాలి. 2002 అక్టోబర్ 1 లోపు జన్మించిన వారు ఓటరు నమోదుకు అర్హులు. ప్రతి ఓటరు తాజా పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో సిద్ధంగా ఉంచుకోవాలి. ఇప్పటికే మ్యాపింగ్ చేసిన ఓటర్లు కూడా తప్పనిసరిగా ఫారం నింపాలి. ఫారం నింపకపోతే ఓటరు జాబితా నుండి పేరు తొలగించబడే అవకాశం ఉంది. ఈ ప్రక్రియను నిర్లక్ష్యం చేయవద్దు. మీ ఓటు హక్కును కాపాడుకోవడానికి బిఎల్ఓఅందించే ఫారాలను జాగ్రత్తగా పూర్తి చేసి సమర్పించండి.అని చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు తెలియజేసారు.

## టేకులపల్లి మండలంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సర్వే షురూ

- ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి అర్హుడూ ఓటరుగా నమోదు కావాలి: నాయకుల పిలుపు

**టేకులపల్లి జూన్ 25 (జన సంఘర్షణ)**



భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా టేకులపల్లి మండలం పరిధిలో ఓటరు జాబితా సవరణ కోసం ఇంటింటి సర్వే కార్యక్రమం గురువారం ముమ్మరంగా సాగింది. ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి అర్హుడూ ఓటరుగా నమోదు కావాలనే లక్ష్యంతో ఈ ప్రక్రియను చేపట్టారు. ఈ సర్వే కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని గంగారం, లచ్చగూడెం, కిష్టారం, చింతోని చెలక గ్రామపంచాయతీలలో అధికారులు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సవరణలు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కోరం సురేందర్, బీఎల్ఓ పాయం సమ్మక్క, స్థానిక సర్పంచులు, ప్రజలతో కలిసి స్వయంగా పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈది గణేష్, స్థానిక నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సర్వేను విజయవంతం చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

# ర్యాలమడుగులో మద్యపాన నిషేధం..

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 25 (జన సంఘర్షణ)**




మెదక్ మండల పరిధిలోని ర్యాలమడుగు గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామంలో మద్యపాన నిషేధం అమలు గ్రామస్తులు గ్రామ పాలకవర్గం నిర్ణయచ్చారు. గ్రామాభివృద్ధి, యువత భవిష్యత్తు, కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పాలకవర్గ సభ్యులు తెలిపారు. గ్రామంలో మద్యం విక్రయాలు, సేవనం వల్ల శాంతిభద్రతలకు భంగం కలుగుతోందని, కుటుంబాల్లో సమస్యలు పెరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ సమావేశంలో ఏకగ్రీవంగా మద్యపాన నిషేధ తీర్మానం చేశారు. గ్రామంలో ఎవరూ మద్యం విక్రయాలు చేయరాదని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని పాలకవర్గం స్పష్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై గ్రామస్థాయిలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని పాలకవర్గం విజ్ఞప్తి చేసింది.

## ఉప సర్పంచ్‌ల హక్కుల సాధనకై చలో హైదరాబాద్

- డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్ తరలివెళ్లిన ఉప సర్పంచ్లు.

**ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 25 (జన సంఘర్షణ)**



రాష్ట్రంలోని ఉప సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ, ఉప సర్పంచ్‌ల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ (ధర్నా చౌక్) వద్ద నిర్వహించిన మహా ధర్నాకు మెదక్ జిల్లా నుంచి ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా అనిల్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహేష్ గౌడ్ కార్యవర్గ సభ్యులు ధర్నాలో పాల్గొన్నరూ నాయకులు ఉప సర్పంచ్‌లకు గతంలో ఉన్న చెక్ పవర్ అధికారాలను పునరుద్ధరించాలని, ఉప సర్పంచ్‌ల గౌరవ వేతనాన్ని నెలకు రూ.5,000లకు, వార్డు సభ్యుల గౌరవ వేతనాన్ని రూ.3,000లకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారికి తగిన గుర్తింపు, అధికారాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

జన సంఘర్షణ

శుక్రవారం
26 జూన్ 2026

# ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం జరిగేటట్లు చర్యలు తీసుకోవాలి

- పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య
- కోటగిరి పోలీస్ స్టేషన్ ను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్
- పోలీస్ ఇమేజ్ పెంచే విధంగా ప్రతీ సిబ్బంది నిక్కచ్చిగా విధులు నిర్వహించాలి

కోటగిరి/జూన్ 25/

నేడు గురువారం మధ్యాహ్నం సమయంలో గౌరవనీయులు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పీ.ఎస్., కోటగిరి పోలీస్ స్టేషన్ ను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రకాల ఫైల్స్ ను క్షుణ్ణంగా తనిఖీ లు నిర్వహించారు. పోలీస్ విభాగము నిర్విరామముగా నిర్వహిస్తున్న పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం తీసుకోవలసిన చర్యలపై పలు సూచనలు ఇవ్వడం జరిగింది. కోటగిరి పి.ఎస్ పరిధిలోని రికార్డ్‌లను పరిశీలిస్తూ..అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని, ప్రతి కేసులో నాణ్యమైన, ఇన్వెస్టిగేషన్ చేయాలని సబ్ ఇన్స్పెక్టర్ కు సూచనలు చేశారు. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాల జరుగుతున్నాయని, సైబర్ క్రైమ్స్ గురించి వివిధ పాఠశాలలు, కళాశాలలో, సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలలో విలేజ్ పోలీస్ ఆఫీసర్ గా






విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై గ్రామాలలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేసి, అట్టి గ్రామాలలో ఉన్నటువంటి సమాచారము తమపై స్థాయి అధికారులకు ఎల్లప్పుడూ చేరవేయాలి అన్నారు. ఈ పోలీస్ స్టేషన్ సరిహద్దులో మహారాష్ట్ర ఉన్నందున వాహనాల రాకపోకలపై ఎల్లప్పుడూ నిర్విరామముగా నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య అధిగమించడానికి ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ చేయాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలు సూచనలు చేశారు. సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాధించాలనే అత్యాశతో యువత ఆన్లైన్ బెట్టింగ్స్ ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ, సైబర్ మోసగాళ్ళ చేతిలో చిక్కి డబ్బులు కోల్పోతూ అప్పులు చేసి, చేసిన అప్పులను తీర్చలేక తనువును చాలిస్తున్నారని అన్నారు. గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది 24*7 తమ హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని , దూర ప్రాంతాల నుండి ప్రయాణాలకు దూరంగా ఉండాలని, సిబ్బంది ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ హెల్త్ చెకప్ చేయించుకోవాలని, ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా బోధన్ ఎ.సి.పి శ్రీ పి. శ్రీనివాస్, రుద్రూర్ సీఐ శ్రీ కృష్ణ, కోటగిరి ఎస్సై శ్రీ జి. శ్రీనివాస్ యాదవ్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్
- ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి /జూన్ 25/(జన సంఘర్షణ)

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం కామారెడ్డి జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పరిపాలన, పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ, జిల్లా సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుండి నిజాంసాగర్ చౌరస్తా వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అధికారులు, పోలీసు సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొని మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజలను చైతన్యపరిచారు.అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తుకు మూలస్తంభమని, మాదక ద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా







కుటుంబాలు, సమాజం, దేశ అభివృద్ధిని కూడా దెబ్బతీస్తుందని తెలిపారు. విద్యార్థులు, యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కోరారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాజేష్ చంద్ర మాట్లాడుతూ.. జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు నిరంతర నిఘా కొనసాగుతోందని చెప్పారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు పోలీసు శాఖకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. సమాజ సహకారంతోనే మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా కామారెడ్డిని తీర్చిదిద్దగలమని పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, వాటి నిర్మూలనకు కృషి చేయాలని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వి. గిరి, జిల్లా సంక్షేమ అధికారి కుమారి ఐ. ప్రసన్న, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు, పోలీసు అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బాన్సువాడలో నాటు తుపాకుల తయారీ.. 8 మంది అరెస్ట్

- బాన్సువాడ కేంద్రంగా నాటు తుపాకులు తయారు చేస్తున్న ముఠా గుట్టును కామారెడ్డి పోలీసులు రట్టు చేశారు.


కామారెడ్డి బాన్సువాడ/(జూన్ 25/( జన సంఘర్షణ)




బాన్సువాడ కేంద్రంగా నాటు తుపాకులు తయారు చేస్తున్న ముఠా గుట్టును కామారెడ్డి పోలీసులు రట్టు చేశారు. తుపాకులు తయారు చేస్తున్న వ్యక్తితో పాటు అడవి జంతువుల అక్రమ వేటకు పాల్పడుతున్న మొత్తం 8 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

**గాంధారి పీఎస్ పరిధిలోని...**

ఈ మేరకు ఎస్పీ రాజేష్ చంద్ర మీడియాకు వివరాలు వెల్లడించారు. బుధవారం రాత్రి గాంధారి పీఎస్ పరిధిలోని మొండి సడక్ చౌరస్తా వద్ద గాంధారి ఎస్సై మహేందర్, సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బజాజ్, హెచ్ఎఫ్ డీలక్స్ మోటార్ సైకిళ్లపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. అప్రమత్తమైన పోలీసులు వారిని వెంబడించి పట్టుకుని విచారించగా అడవి జంతువుల వేట కోసం నాటు తుపాకులు కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్లు అంగీకరించారు. వారి వద్ద 2 నాటు తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. వారిచ్చిన



సమాచారంతో ఎస్పీ ఆదేశాల మేరకు సదాశివనగర్ సీఐ, గాంధారి, తాడ్వాయి ఎస్ఐలు, సిబ్బందితో మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దాడులు నిర్వహించారు. నిందితులు సలావత్ చందర్, ఆంగోత్ ధర్మ నాయక్ అలియాస్ ధర్మ, బాన్సువాడకు చెందిన అస్లాం దావుస్‌లు నిజాంపేట్, బాన్సువాడ మండలాల్లోని చిన్నరాంపూర్, హాజీపూర్ గ్రామాల్లో ఒకొక్క తుపాకీని రూ.10వేలకు విక్రయిస్తున్నట్లు తేలిందన్నారు.

**గండివేట్ తండాకు చెందిన..**

గండివేట్ తండాకు చెందిన విస్లావత్ అరుణ్, విస్లావత్ గోపిచంద్, ఆంగోత్ లక్ష్మణ్, విస్లావత్ నాను, విస్లావత్ గణేశ్‌లు నిందితులుగా ఉన్నారని ఎస్పీ తెలిపారు. మూడు గన్‌లకు ట్రిగ్గర్ మెకానిజమ్‌లు లేకపోవడంతో గండివేట్ తండా సమీపంలో పొలంలో దాచిపెట్టినట్లు చెప్పగా, స్వాధీనం చేసుకున్నారని వివరించారు. జిల్లాలో అక్రమ ఆయుధాల సంస్కృతికి, వన్యప్రాణుల వేటకు తావులేదని ఎస్పీ హెచ్చరించారు. నేరస్తులకు సింహస్వప్నంగా, ప్రజలకు రక్షణగా 'ఆపరేషన్ కవచ్' ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందని, చట్టవ్యతిరేక చర్యలపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. నిందితుల నుంచి 5 నాటు తుపాకులు, ఒక ఎయిర్ గన్, 3 ట్రిగ్గర్ మెకానిజమ్‌లు, 3 చాప్స్, స్టీల్ పెలెట్స్, గన్‌పౌడర్, పొటాష్, ఫ్లెట్స్‌తో పాటు భారీగా వేట సామగ్రి, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ ఆయుధాల సరఫరా, వన్యప్రాణుల వేట ముఠా నెట్‌వర్క్‌ను ఛేదించిన సదాశివనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, గాంధారి ఎస్ఐ మహేందర్, తాడ్వాయి ఎస్ఐ నరేశ్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు. ఈ సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్ రావు, సీఐ సంతోష్ కుమార్, గాంధారి, తాడ్వాయి ఎస్సైలు మహేందర్, నరేష్ పాల్గొన్నారు.

# పౌష్టికాహారం అందించాలి..

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 25 (జన సంఘర్షణ)



అంగన్వాడీలోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచి ంచారు. గురువారం నర్సాపూర్ మండలంలోని అచ్చంపేట్ అంగన్వాడి కేంద్రాన్ని ఆర్డీవో తాహాసిల్దార్ తో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అంగన్వాడీ విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం బలవర్ధకమైన సంపూర్ణ పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అంగన్వాడీలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. తక్కువ బరువు ,ఎత్తు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియ పరిశీలించిన బిఆర్ఎస్ అధ్యక్షుడు ఎంఏ అకీమ్ జల్లపల్లి ఫారంలో

జిల్లపల్లి ఫారం/జూన్ 25/(జన సంఘర్షణ)



పోతంగల్ మండల్ : ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా చేపట్టిన ఓటరు మ్యాపింగ్ కార్యక్రమాన్నిఎంఏ అకీమ్ జల్లపల్లి పరిశీలించారు. జిల్లపల్లి గ్రామం పట్టణంలోని 5వ వార్డులో పర్యటించిన ఆమె, ఎన్యూమరేషన్ ఫారాలను ఓటర్లకు పంపిణీ చేసి, ఒక కుటుంబానికి సంబంధించిన వివరాలను మొబైల్ యాప్ ద్వారా నమోదు చేశారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎంఏ అకీమ్, సామాజిక సేవ, మాజీ సర్పంచ్ షేరు, సజ్జాద్, గ్రామస్తులు, బి ఎల్ ఓ రజియా రెవిన్యూ సిబ్బంది, ముజాహిద్, పందరి తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ్ భారత్ కు ఆద్యుడు సంత్ గాడ్గే బాబా

- సామాజిక సమరసత వేదిక కన్వీనర్ అప్పాల ప్రసాద్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 25 (జన సంఘర్షణ)




సామాజిక సేవయే సమరసతకు నాంది పలికడమే కాదు సమాజంలో పేరుకుపోయిన మూఢాచారాలను, అంద విశ్వాసాలను రూపుమాపడానికి ఆజన్మాంతం కృషి చేశారని తెలంగాణ రాష్ట్ర సామాజిక సమరసత వేదిక కన్వీనర్ అప్పాల ప్రసాద్ ప్రశంసించారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో అభ్యాస వర్గ కార్యక్రమానికి హాజరైన ఆయన తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా మెదక్ జిల్లా కేంద్రంలో మన రజక సంఘం ఆధ్వర్యంలో 3 ఏళ్ళ క్రితం ఏర్పాటు చేసిన శ్రీ సంత్ గాడ్గే బాబా గారి విగ్రహన్ని సందర్శించి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని ఊరురా తిరిగి తన చీపురుతో వీధులను శుభ్రం చేస్తు ఎందరికో ఆదర్శంగా నిలిచారు అనేక పాఠశాలలను ఆనాద శరణాయలను, దేవాలయాలను, సత్రాలను నిర్మించిన ఆధునిక మహారాజని కొనియాడారు. ఆయన వెంట మెదక్ పట్టణ రజక యువజన సంఘం అధ్యక్షుడు బక్కవారి శివకుమార్ తో పాటు రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు బోధన్ విద్యార్థుల ఎంపిక

- జిల్లా స్థాయిలో సత్తా చాటిన సాయి సామల చెస్ అకాడమీ విద్యార్థులు.

బోధన్ నిజామాబాద్/జూన్ 25/(జన సంఘర్షణ)




బోధన్ నిజామాబాద్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-11 చెస్ ఛాంపియన్షిప్లో బోధన్కు చెందిన సాయి సామల చెస్ అకాడమీ విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. జిల్లా స్థాయి బాలికల విభాగంలో ఎం. నిత్య శ్రీ ప్రథమ స్థానం సాధించి జిల్లా ఛాంపియన్గా నిలవగా, ఎస్. సాయి సహారా ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు పిల్లలు పాల్గొన్నారు

# విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలి లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 25 (జన సంఘర్షణ)

జూలై 4 న జిల్లా సదస్సు, జూలై 10 న విద్యుత్ ఎస్.ఈ ఆఫీస్ ముందు ధర్నా, ఆగస్టు 10 న జైల్ బరో జయప్రదం చేద్దాం. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు,ఉపాధి కూలీల పొట్ట కొట్టే వి.బి.జి.రామ్.జీ పథకం రద్దు, విద్యుత్ సంస్కరణ,విత్తన బిల్లుల రద్దు చేసే వరకు పోరాటాలు కొనసాగిస్తామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొప్పని పద్మపిలుపునిచ్చారు. గురువారం కేవల్ కిషన్ భవన్ లో సిఐటియూ రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త సమావేశం లో పద్మ ముఖ్య అతిథిగా గా హాజరై ప్రసంగించారు. దేశ వ్యాప్త పిలుపులో బాగంగా జూలై ఆగస్టు నెలల్లో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలను చైతన్యం చేస్తూ పోరాటాలకు సాన్నద్ధం చేయాలనిపిలుపునిచ్చారు. నాడు బ్రిటిష్ నిరంకుశ పాలన దేశ సహజ సంపదను ఇంగ్లాడుకు దోచుకు పోతే దానికి వ్యతిరేకంగా 1947 ఆగస్టు 9 న క్విట్ ఇండియా ఉద్యమం నిర్వహించిన తర్వాత బ్రిటిష్ వాడు దేశాన్ని ఆగస్ట్ 14 అర్థ రాత్రి వదిలి పారిపోయారన్నారు. నేడు దేశంలో నరేంద్ర మోదీ పరిపాలన కూడా పేదల పొట్టలు కొట్టి, దేశ సంపద సహజ వనరులు అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల పరం చేస్తుందన్నారు.కార్మిక చట్టాలు, ఉపాధి హామీ చట్టం రద్దు, విత్తన విద్యుత్ సంస్కరణ చట్టం చేయడం దీనికి నిదర్శనం అన్నారు.తెలంగాణ లోని రేవంత్ రెడ్డి నాయకత్వం లోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేంద్ర జి.జె.పి బాటలోనే నడుస్తూ రరేంద్ర మోడీ తెచ్చిన లేబర్ కోడ్స్, వి.బి. జి.రామ్.జీ, పథకం అమలు కు చర్యలు, విద్యుత్ సంస్కరణ లు అమలుకు చర్యలు



తీసుకోవడం చేస్తే స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. ఈ దేశంలో మోడీ సర్కారు,కార్పొరేట్ బంధాన్ని విడదీయాలంటే క్విట్ ఇండియా ఉద్యమం మాదిరిగా క్విట్ కార్పొరేట్ ఉద్యమాన్ని ఈ దేశంలో నిర్వహించాల్సిన అవసరం ఏర్పడిందని వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు పద్మ అన్నారు.వ్యవసాయ, కార్మిక సంఘాలన్నీ ఏకమై పోరాటంలో బాగంగా ఆగస్టు 10 న జరిగే జైల్ బరో కార్యక్రమంలో జిల్లా లోని కార్మికులు కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తెస్తున్న విద్యుత్ సంస్కరణ లు, రాష్ట్ర ప్రభుత్వం తెస్తానంటున్న రైతు డిస్కమ్ కు వ్యతిరేకంగా ప్రజలు, వినియోగ దారులను చైతన్య పరుస్తూ మండల స్థాయిలో సదస్సులు నిర్వహిస్తామని, జూలై 10 న విద్యుత్ ఎస్.ఈ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహిస్తామని పిలుపునిచ్చారు. జిల్లాలోని కార్మికులు కర్షకులు, మేధావులు, అన్ని తరగతుల ప్రజలు ఈ ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.బలమని, ఏ.మల్లేశం, వ్యవసాయ కార్మిక సంఘం జిలా అధ్యక్ష కార్యదర్శులు గోరయ్య, కే.మల్లేశం, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనర్సయ్య,వివిధ సంఘాల నాయకులు లచాగౌడ్,రరేందర్, పోచమ్మ, శేఖర్,యేసు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయం వద్ద ధర్నా

బోధన్ డివిజన్/జూన్ 25/(జన సంఘర్షణ)




ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ అధ్యక్షులు మీసాలె నాగేష్ మాట్లాడుతు దాదాపు వారం రోజుల నుండి ప్రైవేట్ స్కూళ్లలో విచ్చలవిడిగా బుక్స్ అమ్ముతున్నారు అనే న్యూస్ రావడంతో స్పందించి ప్రైవేట్ స్కూల్ కు వెళ్లి అడగడం జరిగింది. వారు మాకు అమ్మొద్దని అనడానికి మీరు ఎవరు అనడం జరిగింది విద్యాశాఖ అధికారులు మమ్మల్ని నడపమన్నారని అనడం జరిగింది, వెంటనే ఎంఈఓ కి కాల్ చేసి మాట్లాడితే నాకు ప్రైవేట్ స్కూళ్లలో బుక్స్ అమ్మకూడదు అనే గురించి నాకు ఎలాంటి అవగాహన లేదు అనడం జరిగింది, అవగాహన లేకుంటే వెంటనే అధికారులు ఎంఈఓని ట్రాన్స్ఫర్ చేసి వేరే ఎంఈఓ ను, నియమించాలని కోరుతున్నాం దీనిపై కలెక్టర్ వెంటనే స్పందించి ప్రైవేట్ స్కూళ్లపైన బుక్స్ అమ్మకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతాం డీఈఓ కార్యాలయం కూడా ముట్టడి నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను, ప్రైవేట్ స్కూల్లో విద్యార్థుల తల్లిదండ్రులు మాకు సమాచారం ఇవ్వడం జరిగింది విచ్చలవిడిగా అధిక రేట్లకు బుక్స్ అమ్ముతున్నారని కావున మేం దీనిపైన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది అలాగే ఏదైతే డివిజన్లో ఉన్నటువంటి ప్రైవేట్ స్కూళ్లలో పేద మధ్య తరగతి తల్లిదండ్రుల విద్యార్థులు ఉన్నారు వాళ్లకు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేయడం అలాగే బయట కొంటే బుక్స్ 2000 నుంచి 2500 వరకు వస్తున్నాయి , వాటిని ప్రైవేట్ స్కూల్ యజమాన్యం 6000 నుంచి 10000 వరకు అమ్మడం జరుగుతుంది, అలాగే ప్రభుత్వ నిబంధన ప్రకారం బహిరంగ మార్కెట్ ఎంపిక విద్యశాఖ నిబంధన ప్రకారం స్కూల్ యాజమాన్యాలు తాము సూచించిన పుస్తకాలు బయట మార్కెట్లో దొరికేలా కనీసం మూడు విభిన్న బుక్ స్టాల్స్ పేర్లను తల్లిదండ్రులకు తెలియజేయాలి, నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్నారు విచ్చలవిడిగా రేట్లలో అమ్ముతున్నారు. కావున దీనిపై వెంటనే ప్రైవేట్ స్కూళ్ల పైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. ఎంఈఓకి అవగాహన లేకపోతే ట్రాన్స్ఫర్ చేయాలని, కొత్తగ ఎంఈఓవీని, నియమించాలని కలెక్టర్ని మీడియా ముఖంగా కోరుతున్నాం. దీనిపైన విద్యాశాఖ అధికారులు స్పందించకపోతే మేం పెద్ద ఎత్తున డీఈఓ కార్యాలయం ముట్టడి నిర్వహిస్తాం అలాగే కలెక్టర్ కూడా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి నిఖిల్, పట్టణ కార్యదర్శి వీరేష్, రాజ్ రతన్ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

# హామీ ఇచ్చారు... స్మశాన వాటికకు విద్యుత్తు వచ్చింది

- కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు శశికాంత్ కృషితో

బీర్కూర్ /జూన్ 25/(జన సంఘర్షణ)



దశాబ్దలకాలంగా స్మశాన వాటికలో విద్యుత్తు లేక రాత్రి వేళలో అక్కడికి వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. అంతేకాదు స్మశాన వాటికలో రాత్రి వేళలో దహన సంస్కారాలు చేయాలంటే అక్కడ విద్యుత్తు లేకపోవడంతో చీకట్లో ఈ కార్యక్రమాలు చేయాల్సి వస్తుంది. ఇటీవల ఓ యువకుడు మృతి చెందడంతో, ఆయన అంత్యక్రియలకు హాజరైన బీర్కూర్ కు చెందిన యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శశికాంత్ హాజరయ్యారు రాత్రిపూట ఈ దహన సంస్కారాలు జరగడంతో రాత్రి వేళలో అక్కడ పూర్తిగా చీకటిగా ఉండి గడ్డి పెరిగి విషపురుగులు తిరిగే ప్రాంతంలో ఈ స్మశాన వాటిక ఉంది. ఇక్కడ విద్యుత్తు లేకపోవడం, మరొకపక్క నీటి సౌకర్యం లేకపోవడంతో శశికాంత్ స్పందించాడు. వెంటనే ట్రాన్స్కో అధికారులకు ఈ విషయాన్ని గుర్తు చేశారు. వారం రోజుల్లో ఈ స్మశాన వాటికలో విద్యుత్తు సరఫరా అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. శశికాంత్ విజ్ఞప్తి మేరకు గురువారం స్మశాన వాటికలో విద్యుత్తు సౌకర్యం కల్పించడానికి విద్యుత్ స్తంభాలు పాతారు. రెండు రోజుల్లో స్మశాన వాటికలో విద్యుత్తు అందిస్తామని ట్రాన్స్కో అధికారులు వెల్లడించారు. శశికాంత్ స్పందన ట్రాన్స్కో అధికారులు స్పందించడం స్మశాన వాటికకు విద్యుత్తు సరఫరా రావడం పట్ల గ్రామస్తులు శశికాంత్ కు కృతజ్ఞతలు తెలిపారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి స్మశాన వాటికలో నీటి సౌకర్యం వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తానని శశికాంత్ మన దినపత్రిక ప్రతినిధితో వెల్లడించారు.

# ఆర్థిక భరోసా నిచ్చిన కోనేరు చారిటబుల్ ట్రస్ట్

వర్ని: జూన్ 25( జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా వర్ని తోపాటు బావరిశెట్టి దుర్గాప్రసాద్, దుర్గాదేవి కుమారుడు యశ్వంత్ సాయి, మల్లారెడ్డి స్కూల్లో 6 వ తరగతి చదువుతున్నాడు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదని కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ని వారు ఆశ్రయించగా, కోనేరు చారిటబుల్ ట్రస్ట్ వారు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్, వెంటనే స్పందించి ఒక సంవత్సరానికి స్కూల్ ఫీజ్ , బుక్స్ ఫీజ్, 30,000 రూపాయలు స్కూల్ యజమాన్యానికి చెల్లించి,వారి కుటుంబానికి, రసీదు అందించడం జరిగింది. వారి కుటుంబానికి అండగా ఉంటానాని భరోసాని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రస్టు బృందం, రెడ్డి వినోద్, వెంకటేష్, తాళ్లూరి సంతోష్, ఆలపాటి హరికృష్ణ,బెడద సంతోష్,జాస్తి అనిల్,వినయ్ పాల్గొనడం జరిగింది.

# ప్రత్యేక పూజలతో భవాని మాత

- సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠ నిర్వహణ.
- ముఖ్య అతిథిగా పాల్గొన్న బిఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి.తిరుపతిరెడ్డి.
- పెద్దబాయి తండాలో భక్తి పారవశ్యంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 25: (జన సంఘర్షణ)





మెదక్ మండలంలోని పెద్దబాయి తండాలో గురువారం భవాని మాత సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని తండావాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి బిఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠరెడ్డి.తిరుపతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి, సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంజారా సమాజ ఆరాధ్య దైవమైన భవాని మాత కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. సమాజానికి మార్గదర్శకుడైన సేవాలాల్ మహారాజ్ చూపిన సేవా భావం, మానవతా విలువలు, ధర్మబోధనలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. యువత సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ఆచరిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడమే కాకుండా ఐక్యత, సోదరభావం, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడతాయని తెలిపారు. పెద్దబాయి తండా ప్రజలు ఎంతో ఐక్యంగా ఈ మహోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. భవాని మాత ఆశీస్సులతో గ్రామం మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు కంఠరెడ్డి తిరుపతిరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మార్గం, మాజీ సర్పంచ్ వెంకటేశం, ఏడుపాయల దేవస్థానం చైర్మన్ మాజీ బాల గౌడ్ బిఆర్ఎస్వి నియోజకవర్గ నాయకులు గంజి నవీన్, నాయకులు, చంద్ర మెహన్ గౌడ్, తండా పెద్దలు, యువకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పరిశీలించిన బిఆర్ఎస్ నాయకుడు డాక్టర్.హకీమ్

పోతంగల్/జూన్ 25/(జనసంఘర్షణ)






పోతంగల్ మండలంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియను బిఆర్ఎస్ నాయకుడు డాక్టర్ ఎం.ఏ. హకీమ్ పరిశీలించారు. మండలంలోని జల్లాపల్లి ఫారం, కొల్లూరు గ్రామాలలో అధికారులు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పరిశీలించిన ఆయన ఎస్ఐఆర్ ఓటరు నమోదు పత్రాలను ప్రజలకు అందజేసి ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బి ఎల్ వో లు ఇచ్చే ఎస్ ఐ ఆర్ పత్రాలను ప్రతి ఒక్కరూ తీసుకొని తమ ఓటు నమోదు సరిచూసుకోవాలని, ఎస్ఐఆర్ ఫామ్ భర్తీ చేసి బీఎల్ఓ లకు అందించాలని సూచించారు. లేదంటే ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా కొత్త ఓటు హక్కును సైతం నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.బిఎల్వోలు పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను కొనసాగించాలని ఆయన కోరారు. గ్రామాల్లో ఎక్కడైనా ప్రజలకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై ఇబ్బంది ఉంటే బిఆర్ఎస్ నాయకుల దృష్టికి తీసుకురావాలని వెంటనే అక్కడికి చేరుకొని వారి సమస్యను పరిష్కరిస్తామని ప్రజలకు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# పొత్తంగల్ నుంచి ఖాజాపూర్, హూమూస వెళ్లే మార్గం సోంపూర్ గ్రామ సమీపంలో

- ప్రధాన రహదారులు మరమ్మత్తుల దశలో ప్రమాదాలకు కేరాఫ్.....
- అనేక ఏళ్లు గడిచిన బ్రిడ్జి నిర్మాణం కలగానే ఉంది.........

పొతంగల్ సోంపూరు/జూన్ 25/( జన సంఘర్షణ)





నిజామాబాదు జిల్లా పొతంగల్ నుంచి నుంచి సాలూరు వెళ్లే మార్గం మార్గం మద్యంలో సోంపురు గ్రామ సమీపంలో ఉన్న బ్రిడ్జి పరిస్థితి అయోమయంగా ఉందని బ్రిడ్జి నిర్మాణం కలగానే ఉందని అనేక ఏండ్లు అవుతున్న బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంలో పాలకులు విఫలమవుతున్నారని పాలకులు మారినా ప్రభుత్వాలు మారినా బ్రిడ్జి నిర్మాణం జరగడం లేదని అదే విధంగా ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా మారిందని ప్రమాదాలకు తీరంగా మారిందని ప్రధాన రహదారి బాగుపరిచే వారు కరువయ్యారని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సోంపూర్ పోచిరాం అన్నారు, ఇప్పటికైనా ఈ రహదారి నిర్మాణం చేయాలని అదేవిధంగా బ్రిడ్జి నిర్మాణ పనులు కూడా చేయాలని ఎందుకంటే ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం అవుతుందని, రోడ్డు పరిస్థితి అద్వానంగా మారిందని రోడ్డు దుస్థితి చూస్తే భయంకరంగా మారిందని ఓట్ల కోసం వచ్చే పాలకులు రోడ్డు దుస్థితి గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని పోచిరాం అన్నారు. ఓవైపు రోడ్డు బాగు లేక మరోవైపు బ్రిడ్జి నిర్మాణం చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజల సమస్యల గురించి పట్టించుకోవాలని లేని పక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరికలు చేశారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శుక్రవారం
26 జూన్ 2026

## కోనేరు చారిటబుల్ ట్రస్ట్ యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ

నిజామాబాద్ జిల్లా, రుద్రూర్,జూన్ 25( జనసంఘర్షణ):



రుద్రూర్ మండల, కేంద్రంలో మూడు గ్రామాలలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రుద్రూర్, అంబం, రణంపల్లి,అక్బర్ నగర్ గ్రామంలో యువతకు క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యువతలో కిడ్రా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెరగడానికి క్రీడలు దోహదపడతాయని కోనేరు శశాంక్ పేర్కొన్నారు,క్రికెట్ కిట్ ను ట్రస్ట్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ బృందం, ముదునూరి కృష్ణంరాజు,కటిక రామరాజు, నాగారం చిన్న సాయిలు,బేగరి వినోద్ కుమార్,ఆలపాటి హరికృష్ణ,ప్రశాంత్ గౌడ్,ఏముల గజేందర్, పార్వతి,మురళి, వడ్ల సాయినాథ్,బోజిగొం అనిల్,చుండూరి రవితేజ,కుర్లెపు గంగాధర్,రేపల్లి సాయిప్రసాద్ పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ప్రారంభించిన సర్పంచ్

నిజామాబాద్ జిల్లా, రుద్రూర్, జూన్ 25( జనసంఘర్షణ):



రుద్రూర్ మండల కేంద్రంతో పాటు అంబం ఆర్, రాయకూర్ క్యాంప్, అక్బర్ నగర్, సులేమాన్ నగర్ తదితర గ్రామాలల్లో సర్పంచ్ లు గురువారం ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా బిఎల్ఓ లు ఇంటింటికి సర్వే నిర్వహించారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఓటరు జాబితాను సమగ్రంగా సవరించే ప్రక్రియ చేపట్టారని, మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించి, 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్లకు నమోదు చేసే అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తారాబాయి, వివిధ గ్రామాల సర్పంచులు ఇందూరు సునీత చంద్రశేఖర్, కుర్లెపు గంగాధర్, బిఎల్ఓ లు తదితరులు పాల్గొన్నారు.

## రుద్రూర్‌లో ఇంటింటికీ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ

నిజామాబాద్ జిల్లా,రుద్రూర్,జూన్ 25( జనసంఘర్షణ):



రుద్రూర్ మండల కేంద్రంలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. మండల కేంద్రంలోని 68 వ పోలింగ్ బూత్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు కలిసి ఇంటింటికీ తిరిగి ఈ ఫారాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్, మాజీ సొసైటీ అధ్యక్షుడు, డిసిసి సెక్రెటరీ పత్తి రాము, బి ఎల్ ఓ అడపా సాయిలు, అలాగే బి ఎల్ ఓ, అజ్మలొద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్థానిక ప్రజలకు ఫారాల ప్రాముఖ్యతను వివరిస్తూ, వాటిని సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

## బెల్లంపల్లిలో అడవి పంది వేట కేసు..

- ఐదుగురు అదుపులో, మాంసం స్వాధీనం

మంచిర్యాల జిల్లా/జూన్ 25/(జన సంఘర్షణ)



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పరిధిలో అడవి పందిని వేటాడి చంపిన ఘటనలో అటవీ శాఖ అధికారులు ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అడవి పంది మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ఆర్ఓ) పూర్ణచందర్ తెలిపారు.వివరాల ప్రకారం, బెల్లంపల్లి కన్నాల బస్తి రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద అడవి పందిని వేటాడి చంపినట్లు అటవీ శాఖకు సమాచారం అందింది. దీంతో అధికారులు తనిఖీలు నిర్వహించగా, కన్నాల బస్తికి చెందిన శ్రీరాముల సమ్మయ్య అడవి పంది మాంసంతో పట్టుబడ్డాడు.అతడిని విచారించగా, శ్రీరాముల రమేష్, చిలుకూరి వెంకట్, సుల్తాన్ నవీన్, పల్లంకొండ రామ్‌లతో కలిసి అడవి పందిని వేటాడి చంపినట్లు వెల్లడించినట్లు ఎఫ్ఆర్ఓ తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్న అధికారులు, వారి వద్ద నుంచి అడవి పంది మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణులను వేటాడడం, వాటి మాంసాన్ని నిల్వ ఉంచడం లేదా విక్రయించడం చట్టరీత్యా నేరమని అధికారులు హెచ్చరించారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రజలు సహకరించాలని, ఇటువంటి ఘటనలపై సమాచారం ఉంటే వెంటనే అటవీ శాఖకు తెలియజేయాలని సూచించారు.

## డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో భారీ మోసం.. ముగ్గురు అరెస్ట్

హైదరాబాద్ అల్వాల్/జూన్ 25/(జన సంఘర్షణ)






హైదరాబాద్‌లోని అల్వాల్ ప్రాంతంలో డబుల్ బెడ్రూం ఇండ్లు ఇప్పిస్తామని చెప్పి పేద ప్రజలను మోసం చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు అనుచరులమని చెప్పుకున్న కొందరు వ్యక్తులు దాదాపు 100 మంది పేదల నుంచి రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. బాధితుల్లో ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా తిమ్మిరి గోపీనాథ్ పుష్పలత (ఏ2), తిమ్మిరి గోపీనాథ్ విశాల్ (ఏ3), మహేందర్ సింగ్ (ఏ6)లను అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి 79 నకిలీ డబుల్ బెడ్రూం ఇంటి కేటాయింపు పత్రాలతో పాటు మూడు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ పత్రాల ఆధారంగా పేదలను నమ్మించి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న జయరాజ్ గంగాధరన్ (ఏ1), నిషా రాజ్ (ఏ4), చింటూ రాజ్ (ఏ5), అలాగే రాజ్ అండ్ కో. రబ్బర్ స్టాంప్స్ (ఏ7) ప్రస్తుతం పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. డబుల్ బెడ్రూం ఇండ్ల కేటాయింపులు పూర్తిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరుగుతాయని, ఎవరైనా డబ్బులు తీసుకుని ఇండ్లు ఇప్పిస్తామని చెబితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అధికారులు ప్రజలకు సూచించారు. ఈ మోసంలో ఇంకా మరికొందరి ప్రమేయం ఉందా అనే కోణంలో కూడా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

## పోతంగల్ మండలంలో ఈ రోజు నుండి ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం

పోతంగల్/జూన్ 25/(జన సంఘర్షణ)





జిల్లా కలెక్టర్, నిజామాబాద్ ఆదేశాల మేరకు ఈరోజు పోతంగల్ మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభమైంది. మండల పరిధిలోని 14 గ్రామాలలో గల మొత్తం 29 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత బూత్ లెవెల్ అధికారులు, బూత్ లెవెల్ సూపర్వైజర్లు బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొని, గ్రామాల వారీగా ప్రక్రియను ప్రారంభించారు. అన్ని గ్రామాలలో ఎన్నికల నిబంధనలు మరియు మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా కొనసాగుతోంది. ఇంటింటికి తిరిగి ఎన్యూమరేషన్ ఫాం లను పంపిణీ చేయడం జరుగుతుంది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పూర్తి పారదర్శకతతో ఈ ప్రక్రియను నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సంబంధిత సిబ్బంది సమన్వయంతో పోతంగల్ మండలంలోని అన్ని గ్రామాలలో ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పొతంగల్ మండల తహసీల్దార్ సందీప్, ఆర్ ఐ భూషణం, ఆశావర్కర్ గ్రామస్తులు, మాజీ సర్పంచ్ విట్టల్, గజ్జు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

- జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న
- మర్యాద పూర్వకంగా కలిసిన చర్ల మండల అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,చర్ల మండలం,జూన్ 25(జనసంఘర్షణ):



భద్రాద్రి కొత్తగూడెం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్నను చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ భేటీలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, మండల స్థాయిలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడం, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు కార్యకర్తలకు మరింత ప్రాధాన్యత కల్పిస్తూ ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ నాయుడు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి అర్హులైన కుటుంబానికి చేరేలా కృషి చేయడం తమ బాధ్యత అని అన్నారు. పార్టీ అధిష్ఠానం సూచనల మేరకు చర్ల మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలతో కలిసి నిరంతరం పనిచేస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న మాట్లాడుతూ.. పార్టీ విజయానికి కార్యకర్తలే వెన్నెముక అని, ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలంగా తీర్చిదిద్దేందుకు అందరూ సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, ప్రజల విశ్వాసాన్ని మరింతగా చూరగొనే విధంగా సేవా కార్యక్రమాలను కొనసాగించాలని సూచించారు. ఈ మర్యాదపూర్వక భేటీ జిల్లా, మండల స్థాయి నాయకత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, పార్టీ భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేసిన సమావేశంగా నిలిచింది.

## 27న భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులకు శ్రీకారం..

- ఆగమశాస్త్ర ప్రకారం ఆలయ అభివృద్ధి పనులు
- యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి
- అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం



తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన, దక్షిణ అయోధ్యగా ఖ్యాతి గాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులకు ఈ నెల 27వ తేదీన శ్రీకారం చుడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, భద్రాచలం ఆలయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆగమశాస్త్ర నియమాలను కచ్చితంగా పాటిస్తూ ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు భద్రాచలం శ్రీ రాముని ఆలయ వైభవం, ఆధ్యాత్మికతకు ఎటువంటి భంగం కలగకుండా, సంప్రదాయ శిల్పకళను ప్రతిబింబించేలా రాతి నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. రాబోయే రెండు వందల సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్ తరాలకు కూడా ఆదర్శంగా నిలిచే విధంగా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారని ఈ మేరకు ఈ నెల 27వ తేదీన ఆలయ పునరుద్ధరణ పనులను అధికారికంగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోనే పనులు పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆలయ పునరుద్ధరణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 351 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వచ్చే శ్రీరామ నవమి నాటికి నిర్దేశించిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి ముందస్తుగానే పనుల విభజన చేసుకొని సమతరంగా అన్ని పనులు చేపట్టాలని సూచించారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co